పెద్ద కథ

# జాతకఫలం

పి. వి. పల్లి

రామప్పంతులు గుమ్మం యెక్కేసరికి కోటీశ్వర్రావూ, సుబ్బారావూ యెదురయ్యారు.

"ఓహో-యెంతసేపయింది వచ్చి? — అంతా కులాసాయేనా?" ప్రశ్నించారు పంతులు.

వాళ్ళిద్దరూ తనకి దూరపు బంధువులు. కాని ముఖ్య స్నేహవర్గంలోని వారిలోనే జమ. చాలా కాలమయింది వాళ్ళని చూచి, ఎన్నడూ రాని వాళ్ళు యివాళ వచ్చారంటే యేదో పెద్ద పని వుండి వుంటుందని నిశ్చయించాడు.

"అంతా ఓ అరగంటయింది" అన్నాడు కోటీశ్వర్రావు. సుబ్బారావుకన్న కోటీశ్వరాౄవుకీ, పంతులుగారికీ హెచ్చుపరిచయం.

"పొలంవెళ్ళి వస్తున్నారా అన్నగారూ—" అంటూ ఇంట్లోంచి బయటకు వస్తున్నాడు రామలింగం పంతులు. అతని వెనకాల వాళ్ళ పెద్దబ్బాయికూడాను. ,ఏదో "కుంభకోణం వుం"దనుకున్నాడు పంతులు.

"ఆఁ...పొలంనుండే వస్తున్నా" గదిలోకి వెళ్ళి వాణీని గోడకి తగిలించి, ఇవతల వరండాలోకి వచ్చాడు.

"ఏమేవ్. కాఫీలయ్యాయా లేదా?" కేకేశాడు యింట్లోకి.

"అన్నీ అయ్యాయి" అన్నాడు రామలింగం పంతులు.

రామలింగం పంతులూ, రామప్పంతులూ బంధుత్వాన కాకపోయినా-చాలా సన్నిహితులు. వారానికోసారి, పదిరోజులకోసారి పట్నంలో కల్సుకుంటూనే వుంటారు. అంచేత బాగా చనువు యేర్పడింది. రామలింగంగారి భూములు ఆ వూళ్ళో వుండడంవల్ల అప్పటప్పట ఆ వూరు వస్తూ పోతూంటారు. కాస్త వ్యవహారజ్ఞానం తెల్సినమనిషికూడా.

అమాటా యీమాటా అయింతర్వాత, తమలపాకులకి సున్నంపట్టించి, బరంపురం ఖారా మసాలాగుండ యింత నోట్లో పోసుకుని, ఆకులు నములుతూ ప్రశ్నించాడు రామలింగం—

"మీవాడు యీ సంవత్సరంతో చదువు చాలిస్తాడా?"

"ఏమో-వాడిష్టం మెట్రుయేక్కే వుద్దేశంలోనే వున్నాడు. నేనే వద్దంటున్నాను. అప్పుడే వయసు ముదిరింది. ఆ మధ్య జబ్బు చెయ్యడం వల్లా, మేనమామ దగా చెయ్యడంవల్లా రెండేళ్లు అంతరాయం కలిగింది చదువుకి."

"అయినా వాడు యింకా చదవాలనే అనుకుంటున్నాడు" అంది మీనాక్షమ్మ గుమ్మంలోపల నిలబడి.

రామప్పంతులు యెర్రగా చూడగానే ఆవిడ ఇంట్లోకి వెళ్ళిపోయింది. నలుగుర్లోకేవచ్చి మాట్లాడ్డమంటే రామప్పంతులకి కిట్టదు. ఏదో కొడుకు వూసువచ్చిందికదా అని ఆవిడ యివతలకొచ్చింది.

"ఈ సంవత్సరం చదువు మాన్పించి యేంచేస్తారు?"

"మాకేమండీ—భూములున్నాయి. ఇల్లున్నది మరో ఊరుపోయి వుద్యోగం చెయ్యవలసిన బాధ్యత యేమీలేదు. కాకపోయినా మాకే పది మంది వున్నారండీ—వీడే పెద్దవాడు. రెండోవాడింకా సెకండుఫారం చదువుతున్నాడాయెను."

"ఐతే యెక్కడన్నా పెళ్ళిమాటలు..."

"అబ్బే-మావాడికింకా ఏం పెళ్ళండీ. మరో రెండుసంవత్సరాలు పోవాలి."

"పూర్వకాల మనుకున్నారుటండీ, మీ ఇష్టం మీద జరగడానికి? ఈ కాలపువాళ్లున్నారే అంతా వాళ్ళ ఇష్టమే. మనం చూస్తూండటమే!" అందించాడు మాట, కోటీశ్వర్రావు.

"మా పెద్దవాడున్నాడే-వాళ్ళ తరగతిలో వున్న యెవరో అమ్మాయిని ప్రేమించి, "నాకు పెళ్ళి చెయ్యి"లని కూచున్నాడు.

ఏంచేస్తాం చెప్పండి? వాళ్ళకి అలాటి అవకా

కాలు కలక్కముందే మనం ఆ కాస్త కార్యం అయిందనిపించడం మంచిది" సలహా యిచ్చాడు రామలింగం పంతులు.

"మీ వాడేనా—చిల్లర వేషాలు వేసేవాడు కాడు" అన్నాడు కోటీశ్వర్రావు.

"ఏమో-యెప్పుడు ఏది జరుగుతుందో ఎవరం చెప్పగలం" వేదాంతపరంగా మాట్లాడారు-రామప్పంతులు.

"కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదు" రామలింగంగారన్నారు.

"అదీ నిజమేలెండి" అన్నాడేగాని, రామప్పంతులికి అర్థమయిపోయింది, వాళ్లు యెందుకొచ్చారో. ఒక్కసారి గట్టిగా వూపిరితీసి, కాలు మీద కాలువేసుకుని పాదం ఆడిస్తూ, చుట్ట ముట్టించాడు.

"సుబ్బారావు అక్కచెల్లెళ్ళ్ని మీకు తెలుసు కదూ" ప్రారంభించాడు రామలింగపంతులు.

"ఆఁ తెలియకేం-సర్వమ్మేనా?"

"ఆఁ ఆవిడే మహా దొడ్డయిల్లాలు-చచ్చి స్వర్గాన్నుంది" తలాడిస్తూ అన్నాడు కోటీశ్వర్రావు.

"ఆవిడకి ఇద్దరు కూతుళ్ళూ ఒక కొడుకూను" అన్నాడు రామలింగం.

"అందులో పెద్దకూతుర్ని మా సుబ్బారావుకే యిచ్చారు" అందించాడుమాటని, కోటీశ్వర్రావు.

"నాకు తెల్సుకదూ" అన్నారు పొగవదుల్తూ రామప్పంతులు.

"మరేఁ యిప్పుడు రెండో పిల్ల సిద్ధంగా వుంది పెళ్ళికి. సన్యాశిరాజు, కూతురికి పెళ్ళి అయితే మాచి చచ్చిపోదామని, మంచంమీద కనిపెట్టుకుని వున్నాడు. తీరని జబ్బు-పక్షవాతం మరి. ఆ పిల్లని మీ ముందే పడేస్తేగాని నా ప్రాణం వుండబట్టదు" వచ్చిన పనేదో, తేల్చేశాడు రామలింగపంతులు.

"యీ విషయంలో మీరు వెనకాడకూడదు. మన గౌరవానికి తగ్గట్టుగానే నడుచుకుంటారు వాళ్లు" అన్నాడు ప్రాధేయపూర్వంగా కోటీశ్వర్రావు.

"సన్యాశిరాజు పంతులు మంచం యెక్కిందగ్గరనుండీ, సుబ్బారావే అన్ని వ్యవహారాలూ చక్కబెడుతూంటాడు. అల్లుడైనా, బావమరదైనా వాడేకదూ. వాళ్ళ గోపాలం, యింకా చిన్నతనం మరి" పెళ్ళి పెద్ద యెవరో కూడా తేలిపోయింది రామలింగంగారివల్ల.

రామప్పంతులు, ఎదురుగావున్న కొబ్బరిచెట్టు వేపు చూస్తూ, దీర్ఘంగా ఆలోచనలోపడ్డారు రాబోవు వ్యవహారాన్ని గురించి.

"మొన్ననే మా ఆవిడ వేలు విడిచిన అన్నదమ్ముడు వచ్చివెళ్లాడు. తన కూతుర్ని ఇస్తాననీ, వెయ్యిరూపాయలకు పైగా కట్నం యిస్తాననీ, ఏమేమో చెప్పుకుంటూవచ్చాడు. అయినా "యిప్పుడు అలాటి ప్రయత్నాలేవీ లేవ"నగానే వెళ్ళిపోయాడు" చుట్టదూరంగా విసిరి, ఒక్కసారి ఊమ్మాగు, కాస్త దూరంగా వెళ్ళి.

కోటీశ్వర్రావు వేపు ప్రశార్థంగా చూచాడు సుబ్బారావు. "ఏం ఫర్వాలే"దన్నట్లు చేతితో సంజ్ఞచేశాడు కోటీశ్వర్రావు.

రామలింగంపంతులు దించిన తల యెత్తి "కమ్మరాడింట్లో వున్న కుండకోసం యెంతో మంది వస్తారండీ, అందరికీ లభ్యమవుతుందా? మావాడికి పిల్లనిస్తామని ఎంతోమంది వచ్చారు. ఎంతగానో బతిమలాడారు. చాలాదూరం వెళ్లారు కట్నం విషయంలో. ఇంతకీ వాడు బి. ఏ. చదువుతున్నవాడు కూడాను. అయినా దమ్మిడీ పుచ్చుకోకుండా మేనరికంచేశాను. మనం ఆర్జించుకోవాలిగాని ఒకరు మనకిచ్చే దేమిటి అన్నగారూ?" మహా త్యాగం చేసినవాడిలా తల పంకిస్తూ అన్నాడు రామలింగం పంతులు.

రామలింగంపంతులు చెప్పిందాంట్లో యెంత వరకూ సత్యంవుందో రామప్పంతులికి తెలుసు. ఆ పెళ్ళికి తనుకూడా వెళ్లాడు. రెండువేల రూపాయిలూ, అన్ని లాంఛనాలక్రిందా, ఇస్తేనేగాని, పెళ్ళిపీటలమీద కొడుకుని కూచోనివ్వ లేదు అలాంటిది-తను మహా త్యాగంచేసినవాడల్లే నీతులు నేర్పుతున్నాడు.

"సరే, మావాడితో యీ విషయం ప్రస్తావిస్తాను వాడేమంటాడో" సంభాషణని ముగింప చూసేడు రామప్పంతులు.

"వాళ్ళ యిష్టం యెందుకండీ, మిగతా విషయాలు మనం మాట్లాడుకుంటే వాడుమాత్రం

మీ మాటకి "కాదం"టాడా. మన యిరువురి కుటుంబాల్లోనూ ఎదురుతిరిగే పద్ధతి లేదుకదా."

"అయినా కాలం మారింది కదండీ, పోనీ పెళ్లికూతుర్ని వాడు చూశాక యిష్టపడ్డట్టయితే అప్పుడు మనం మిగిలిన విషయాలు మాట్లాడుకో వచ్చును."

"అది సరేలెండి. ఆ పని జరిగినట్లుగా భావించి, మాట్లాడండి."

"అన్ని విషయాలూ మాట్లాడినాక, వాడు పిల్లని చూచి యిష్టపడకపోతే?"

"గాలీవానా వస్తే కథేలేదు" అన్నాడు రామలింగం పంతులు దగ్గుతూ.

"మీకు తెలియని విషయాలేమున్నాయ్ అన్నగారూ—మీకూ మాకూ చిరకాలంనుండి వస్తున్న బాంధవ్యం-..." వేస్తున్నాడు తాళం రామప్పంతులు. అంతా రామలింగంగారి చేతుల్లోనే వుంది మరి!

"యిలారండి అన్నగారూ-"

రామప్పంతుల్ని నాలుగడుగులు అలాతీసుకు వెళ్ళి "అన్నిలాంఛనాలక్రిందా మొత్తం వెయ్యి రూపాయలు యిచ్చుకుంటారువాళ్లు. అంతకన్న మరి పసుగెత్తలేరు. ఇలా సంతోషించాలి-"

"ఒకరుయిస్తామన్నదేగాని— నేనేం కోరలేదు కదా?-"

"పోనీ మీ మాటని యెందుకు కాదనాలి?- వెయ్యినూటపదహార్లు కట్నం, మిగతా అన్ని లాంఛనాలక్రిందా మరో అయిదువందలు- యిచ్చుకుంటారు- యీ వెంటనే కుర్రాడికి వుత్తరంరాసి తెప్పించండివాణ్ణి. పిల్లని చూచుకుంటాడు—" అని- చెయ్యిపట్టుకుని గుమ్మంలోకితీసుకొచ్చాడు రామలింగంపంతులు.

మాటాడలేకపోయారు, రామలింగం గారికి ఎదురుగా రామప్పంతులుగారు.

"ఒరే సుబ్బారావూ నీ వుద్దేశాన్ని, ఓ మూలతోసేసాను. నా యిష్టంవచ్చినట్లు రైటుచేశాను."

"మీకు తెల్సుకదండీ మా పరిస్థితి..."

"మరి మాటాడకు... తరవాత నీతో చెప్తాను-"

"శుభస్య శీఘ్రం— పిల్లని చూడ్డానికి బయలుదేరడం మంచిది-" నిర్ణయించాడు కోటీశ్వరావు.

"ఓసేవ్, ఆ పంచాంగం యిలా పట్టుకురా" అని మీనాక్షమ్మగారికి కేకవేసి, ఆవిడ తేగానే, కళ్ళద్దాలు సవరించుకుంటూ పేజీలు త్రిప్పి, "ఆదివారం, సప్తమితిథి, శ్రవణం నక్షత్రం, చాలా బాగుంది" అని పుటలు మూసేశారు రామప్పంతులుగారు.

"అంటే. నాలుగురోజులే!" అన్నాడు కోటీశ్వరావు.

"ఈలోగా అబ్బాయిని తెప్పించండి. తిన్నగా మాయింటికొచ్చేస్తే, అక్కణ్ణించి వీళ్ళయింటికి మనందరం కల్సి వెళదాం" పూర్తిచేశారు సంభాషణని, రామలింగంగారు.

అందరికీ సాపిట్లో వడ్డించింది మీనాక్షమ్మ.

* * *

సశాస్త్రీయమైన వివాహాలంటే అమితమైన యిష్టం నారాయణరావుకి. ఇప్పటి, పాశ్చాత్య అనుకరణములైన యీ "రింగ్ మేరేజెస్" అన్నా రిజిష్టర్డు పెండ్లిడ్లన్నా, పరమ అసహ్యం. అనాదిగా వస్తున్న మన సంప్రదాయాలని మంటగలపడం అంటే, అతనికి రోతపుట్టుతుంది. ఈ నూతన విధానాల్లో పెళ్ళిచేసుకున్న వాళ్ళల్లో ప్రేమానుబంధం స్థిరంగా వుండదనీ, యీ విధానాలు వాళ్ళల్లో బలీయమైన ప్రేమని జనింపచెయ్యలేవనీ, మన సంప్రదాయాల ప్రకారం జరిగే పెండ్లిండ్లవల్ల వధూవరుల్లో నిశ్చలమైన ప్రేమ జనించి, అది వాళ్ళ జీవితాంతంవరకూ నిలిచివుంటుందనీ, అతని దృఢనమ్మకం. అందుచేతనే ఓసారి తన సహపాఠి కమల తనని రిజిష్టరు మేరేజ్ చేసుకుంటే మంచిదని ఉపన్యాసం యిచ్చినా తను వ్యతిరేకించాడు. అవుపించడం మానేశాడు. కనుపిస్తే యెక్కడ తనని ఆ విషయంగురించి ప్రస్తావిస్తుందోనని భయపడ్డాడు. అయితే తన భావాలకి వ్యతిరిక్తంగా నడుస్తున్న తన స్నేహితుల్ని చూచి అతను మందలించలేదు. "ఎవరి యిష్టం వారిది" అని వూరుకున్నాడు. తనకి ఆయాపద్ధతులమీద నమ్మకమూ యిష్టమూలేదు. అంతే!

తండ్రి వ్రాసిన వుత్తరం చూచి, వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. పెళ్ళికూతుర్ని చూచి తన వుద్దేశం తెలియబరచడం మంచిది. ఇంతకు ముందు నాలుగైదు సంబంధాలు రావడం, తను

కాదనడం, జరిగాయి. కాని అస్తమానం యిలా కాదంటూవుండడం తలిదండ్రుల్ని కాదన్నట్లే వుంటుందనీ వాళ్ళమాటకి ఎదురాడడం తన అభిమతం కాదుకనుక, వాళ్లు చెప్పినట్లు నడుచుకోవడమే మంచిదనీ, యెప్పటికేనా తను పెళ్ళి చేసుకోక తప్పదనీ నిశ్చయించాడు. రామలింగం పంతులుగార్ని మనకి తెలుసు. తన తండ్రి అతని మాటప్రకారం నడుస్తున్నందుకు తను సంతోషించాడు. రామలింగం పంతులు తమకి యెటువంటి అన్యాయమూ చెయ్యడని తను వూహించాడు. ఇంకా తన తండ్రి వ్రాసిన ఇతర విషయాలు— అంటే కట్నకానుకలు వగైరాగూర్చి తను ఏమీ అనుకోలేదు. ఇలాంటివన్నీ ఒట్టి ఫేన్సీలనీ, అవి తన జీవితానికి ఎలాగూ దోహదంకాదనీ అనుకున్నాడు. తనతోపాటు తన గదిలోవున్న సత్యనారాయణకి జ్యోతిషంలో కాస్త నేర్పరితనం వుంది. "తను వెళ్ళినపని అవుతుంద"ని బయలుదేరుతూంటే మూడుసార్లు నొక్కి వక్కాణించాడు. అయితే జ్యోతిషంలో తనకి నమ్మకం లేకపోయినా, వ్యతిరేకభావం లేదు.

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలయేసరికి రామలింగంగారి గుమ్మంలో, నారాయణరావూ, రామప్పంతులూ, సుదర్శనంగారూ, వెంకటరావూ ప్రత్యక్షమయ్యారు. రామప్పంతులి చెల్లెల్ని సుదర్శనంగారికి ఇచ్చారు. సుదర్శనంగారు రామప్పంతులి చిన్నతనంనుండీ, వాళ్ళ నెరుగుదురు. యిప్పటిదాకా యే కార్యం జరిగినా వాళ్ళకి సహకారిగావుంటూ తనకి తోచినంతవరకూ ఉపకారాలు చేస్తూవచ్చారు. అంచేత సుదర్శనంగారంటే రామప్పంతులుకి మహాచెడ్డ అభిమానం. ఇంకా అతనితోనూ, అతని కుటుంబం, తన చెల్లెలితోనూ సంబంధం కలిసివుండాలని, వెంకటరావుకి తన కూతురునిచ్చి, మేనరికం చేశామని షించుకున్నారు. వెంకటరావుకి వ్యవహారదీక్షత తెలియకపోయినా, ముగ్గురు బ్రాహ్మణులు వెళ్ల కూడదన్న మాటమీద నాలుగోవాడిగా తను బయలుదేరాడు.

"వస్తున్నా"మని రామలింగంగారు, సుబ్బారావుకి, కబురుపెట్టేరు. వాళ్ళ యింటికీ వీళ్ళ యింటికి ఓ ఫర్లాంగుదూరం వుంటుంది. రెండు మూడు వీధులతర్వాత సుబ్బారావు యిల్లున్నది.

కాఫీలు త్రాగడం అయినతర్వాత, తమలపాకులు వేసుకుంటూ రామలింగంగారన్నారు. "సుబ్బారావూ! యెందుకాలస్యం? ఆ తర్వాత దుర్ముహూర్తాలొస్తాయి. విజయలక్ష్మిని తీసుకొచ్చి గదిలో కూచోబెట్టమను. నారాయణరావు చూస్తాడు."

గదిలో ఒకప్రక్క తివాసీ వేసివుంది, ఇంకో పక్కవరసగా ఆరు కుర్చీలు వెయ్యబడ్డాయి. వచ్చిన నారాయణరావు ప్రభృతులతో పాటు రామలింగంగారూ, సుబ్బారావు వున్న యింటి యజమాని ప్రకాశంపంతులూ, కుర్చీమీద ఆసీనులయ్యారు.

తల్లి చనిపోయిన తర్వాత, యిప్పటిదాకా పెంచుతూవచ్చిన, విజయలక్ష్మి పినతల్లి కామేశ్వరమ్మ, విజయలక్ష్మిని తీసుకొచ్చి వాళ్ళకి యెదురుగా తివాసీమీద కూచోబెట్టింది. తను తల చెడ్డదిగనుక అక్కడ కూర్చోవడం మంచిపని కాదని, ప్రక్కకి తప్పుకుంది. విజయలక్ష్మి తల వంచుకుని కూచుంది. గులాబీరంగు సిల్కుచీర కట్టుకుని నీలంరంగు జాకెట్టు తొడుక్కుంది. తలలో సంపెంగ పూలదండ తురుముకుంది. చెవులకి పంజాబీ లోలక్కులున్నాయి. పొడుగాటి వాలుజడ, చివర బంగారపు జడ గంటలు, యిత్యాది అలంకారణలన్నీ విజయలక్ష్మి అందాన్ని యినుమడింప చేస్తున్నాయి.

రామప్పంతులు ఒక్కసారి దీర్ఘంగా చూచి తృప్తిపడ్డారు. సుదర్శనంగారు వికసించిన ముఖముతో రామప్పంతులుగారి వేపు చూచారు, ప్రక్కగా నిలబడ్డ సుబ్బారావూ, వరుసలోనే కూర్చున్న రామలింగంగారు, రామప్పంతులునీ సుదర్శనంగార్ని చూచి తృప్తిచెందారు. కాని అందరి దృష్టులూ నారాయణరావుమీద పడ్డాయి. తదేకధ్యానంతో చూస్తున్న కామేశ్వరమ్మ నారాయణరావుని చూచి, సుబ్బారావు చెవిలో ఏదో గొణిగి, బయటకు లాక్కుపోయింది. మళ్ళీ యిద్దరూ చిరునవ్వుతో గదిలో కొచ్చారు.

దించిన తల యెత్తలేదు విజయలక్ష్మి. కాని క్రీగంటచూడ్డం మానలేదు. నారాయణరావు సులభంగా కనిపెట్టేశాడు. తను తల దించుకోక పోయినా, డైరెక్టుగా విజయలక్ష్మికేసి చూడ్డానికి సిగ్గుపడిపోయాడు.

సుబ్బారావు ప్రక్కగానున్న ఎలక్ట్రిక్ స్విచ్ నొక్కాడు. ఫేన్ జోరుగా తిరుగుతూంటే, గాలి చల్లగా తగులుతూంది.

"నువ్వు రంభలావున్నావు" అన్నాయి నారాయణరావు కళ్లు.

"అవును. మీరుకూడా నవ మన్మధుడిలా వున్నారు" అన్నాయి విజయలక్ష్మి చూపులు.

"నీ అందం - వర్ణనాతీతం-"—నారాయణరావు కళ్లు.

"మీ నుండి మరలలేకుండా వున్నాము" అన్నాయి ఆమె నయనాలు.

"నీ సౌందర్యం నన్నాకర్షించుకుంది—"అతని మనస్సు.

"అంతభాగ్యం కలిగినందుకు ధన్యురాలను—" ఆమె మనస్సు.

"నిన్ను ప్రేమించాను" అతని హృదయం.

"మిమ్మల్ని ఒదిలివుండలేను"ఆమె హృదయం.

"మనం కల్సుకునే దెప్పుడో?" అన్నాయి ఒక్కసారిగా యిరువురి హృదయాలూ.

ఇద్దరి పెదవులమీదా చిరునవ్వు తాండవించింది.

ఇద్దరి ముఖాలూ వికసించాయి.

"పాటలేమన్నా వచ్చునా?" అడిగారు సుదర్శనంగారు.

"హార్మనీ వాయిస్తుంది. త్యాగరాయకృతులు బాగా పాడగలదు"అన్నది పినతల్లి అలమారులో వున్న హార్మనీ తీస్తూ.

"పాట ఘనంగా వుంది" అన్నారు రామలింగంగారు.

"సంసార పక్షంలోవున్న మనకి పాట లెందుకండీ" అనేశారు రామప్పంతులుగారు.

"తన కాబోయే-ప్రియుడు ఏమనుకుంటున్నాడో తన పాటకి?" ,ఆ వేదనపడింది విజయలక్ష్మి. మళ్ళీ ఒక్కసారి తలెత్తి చూచింది నారాయణరావువేపు. తను చూస్తున్నట్లు, ఇతరులు చూస్తున్నారన్న మాట మరచిపోయింది. తను, అతనూ కొద్దికాలం అలా చూసుకుంటూనే వుండిపోయారు మళ్లీ.

కామేశ్వరమ్మగారూ, సుబ్బారావుగారూ— గుండెలు కుదుట బరచుకొన్నారు.

"అమ్మాయి చదువుకుందా?" ప్రశ్నించాడు వెంకటరావు. నవీనయుగపు మనిషి మరి!

"మాయింటికొచ్చి పురాణాలు చదవాలిట్రా!" మదలించాడు రామప్పంతులు, మేనల్లుణ్ణి.

"చదువుకుంది నాయనా ఫస్టుఫారందాకా చదువుకుంది" అన్నది కామేశ్వరమ్మ.

"అమ్మాయిని తీసుకుపొండమ్మా" అన్నారు రామప్పంతులుగారు.

"ఒరే-నారాయణా యిలా రా" అంటూ, రామలింగంగారు నారాయణరావుని వీధిలోకి తీసుకెళ్ళారు.

"ఏమంటావ్?" ప్రశ్నించారు.

"మీ వుద్దేశం?" ఎదురు ప్రశ్న వేశాడు నవ్వుతూ.

"నాకు తెల్సు లేవోయ్ మీ కుర్రకారుతరహా" అంటూ భుజంమీద చెయ్యివేసి "చెపుదూ" అన్నారు.

"నా కభ్యంతరంలేదు" అన్నాడు.

మళ్లీ అందుకుని, "ఆ అమ్మాయి ఇష్టపడిందో లేదోకనుక్కోండి"సంశయాస్పదంగా అన్నాడు.

"ఆమాట సరే..." అంటూ లేచిపోయారు రామలింగంగారు.

రామలింగంగారింటికి అందరూ తిరిగి చేరుకునే సరికి పదకొండుగంటలయింది. తన కొడుకు, ముందుగా అలా తన అభిప్రాయం చెప్పడంలో, రామప్పంతులుగారికి కోపంవచ్చింది. తన కాలములో పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ వాళ్ళ యిష్టాయిష్టాలు చెప్పడం వుండేదికాదు. కొపంథా అతనికి గిట్టిందికాదు అంచేత.

భోజనాలయ్యాక సావిట్లో తుంగచాపమీద కూచుని, జాతకాలకట్ట విప్పారు రామలింగంగారు. రామలింగంగారికి జాతకాలు చూడ్డం బాగా తెల్సు. అందులో సంపూర్ణ పాండిత్యం గడించారనే చెప్పాలి. తన యాభైయేళ్ళలోనూ, ముప్ఫైయేళ్ళు జాతకాలు చూడడంలోనే గడిపారు.

సుబ్బారావు కుటుంబంతాలూకు జాతకాలన్నీ అతనివద్దనే వున్నాయి. రామప్పంతులి కుటుంబంలోనివారివీ అతనివద్దవున్నాయి. యిరువురి—నారాయణరావు, విజయలక్ష్మిల జాతకాలూ తీసి ఓ గంటసేపు పరీక్షించారు.

"అన్నగారూ! రెండూ బాగా కలిశాయి" అన్నారు.

"తప్పకుండా పెళ్ళి చేసెయ్యవచ్చు. జాతక రీత్యా చూస్తే మాఘంలో యిద్దరికీ కల్యాణ యోగం కనిపిస్తూంది" మళ్ళీ ఆయనే.

"అలాగే కానీండి. యింకా మూడు నెలలే కదూ—యీలోపున ఏం మునిగిపోయింది?" రామప్పంతులుగారు.

* * *

"అమ్మా! ఈ సంబంధానికి స్థిరపడ్డట్టేనా?" ప్రశ్నించాడు ప్రకాశంపంతులు. కామేశ్వరమ్మగారు కాఫీపొయ్యి విసురుతూంటే లోపలి గుమ్మంలో మఠంవేసుకుని కూచున్నారాయన. కోటీశ్వర్రావు ఆవేళ కోర్టుపనివుందని రాలేదు. సుబ్బారావు, రామలింగంగారింటికి వెళ్ళాడు.

"అలాగే అనుకుంటున్నాం బాబయ్యగారూ! పిల్లా, పిల్లాడు, నచ్చేరు. అంతకంటే మనకి కావలసిందేముంది?"

"అయితే అతను యేంచేస్తున్నాడమ్మా?"

"యింకా చదువుకుంటున్నాట్ట. ముందు ముందు నూటయాభయిరూపాయిల ఉద్యోగం కావచ్చునట. పదెకరాల మాగాణీ, పదిహేనెకరాల మెరకా, ఆరెకరాల తోటా వున్నాయట. మంచి పెంకుటిల్లు వుందిట. మరో అన్నదమ్ముడు వున్నాట్ట."

"యేదేనా మంచిసంబంధమే చూడాలి. తల్లిలేనిపిల్ల. తండ్రివున్నా లేనిలోనే జమ. నువ్వే దాని మంచిచెడ్డలు చూడవలసినదానివి. సుబ్బారావుకి యింకా వ్యవహారాల్లో అట్టే ప్రవేశంలేదు. గోపాలంగాడు కుర్రకుంక."

తన యింట్లో ఆరేళ్ళనుండీ అద్దెకుంటున్న వాళ్ళ కుటుంబవిషయాలు యావత్తూ బాగా తెల్సు తనకి. అందికే అంత చనువుగా మాట్లాడగలుగుతున్నాడు.

"బాబయ్యా! మీరంతా వున్నారుగదా. దానికేం?"

"అదికాదమ్మా, కాస్త మంచిసంబధంచూచి యివ్వడం మంచిది."

"అయితే యీ సంబంధం మంచిదికాదా?" ప్రశ్న బయలుదేరింది కామేశ్వరమ్మలో. గుండెలు గతుక్కుమన్నయి.

అడిగింది ప్రకాశంగార్ని- "యీ సంబంధానికేం?"

"ఆహాఁ. అదికాదు నేనన్నేది. మంచిసంబంధం చూచియిస్తే మనవేపు చూడనవసరం వుండదు. అయినా పిల్లవాడి మంచి చెడ్డలు అవీ జాగ్రత్తగా చూసుకుంటే మనకి బాధవుండదు."

ప్రకాశంగారి ధోరణిని వింటూంటే కామేశ్వరమ్మకి యేమీ తోచడం లేదు.

"వస్తానమ్మా! వీధిలోకి వెళ్ళివస్తా. యెందుకేనా మంచిది. కుర్రాడి జాతకం ఓసారి తెమ్మను."

* * *

సుబ్బారావు ఉప్పొంగిపోయాడు, తను మంచి మంచిసంబంధం చూచాడు తన మేనకోడలికి. తల్లిలేని లోటు వుండదు. కాబోయే అత్తగారు మణిపూసలాంటి మనిషని రామలింగంగారుచెప్పారు. సుఖపడుతుంది యీ సంబంధంచేస్తే. కుర్రాడు కూడా బుద్ధిమంతుడు. బాగా లోకజ్ఞానం సంపాయించినవాడు కూడా. గడసరి, యీడూజోడూ బాగుంది. విజయలక్ష్మికూడా యిష్టపడింది. కాకపోయినా, యిందాక, ఆ యిద్దరి చూపుల్లోనూ తనకి బాగా నమ్మకంకలిగింది. యిష్టపడ్డారు కనుకనే తను మేనకోడల్ని అడిగితే, నవ్వుకుంటూ అలా వెళిపోయింది. అంచేత తను యీ సంబంధం యెలాగయినా నిశ్చయం చేయాలి. అందుకే రామలింగంగార్ని పట్టుకున్నాడు. పట్టుకున్నందుకు ఫలితంగా, తను యీ విషయంలో కృతకృత్యుడయ్యాడు. పెండ్లికొడుకూ, అతనివర్గంలోని వారూ యిష్టపడ్డారు. తనకట్టే ప్రయాసకూడా వుండదు, కట్నం విషయంలో. తన యిష్టప్రకారమే వాళ్ళుకూడా వొప్పుకున్నారు. రామలింగం పంతులి మాటప్రకారం, రేపు నిశ్చయతాంబూలాలు పుచ్చుకోవాలి. యీ సాయంత్రంలోపల కోటీశ్వరరావుగారికీ-మిగతా వారికీ కబుర్లుపెట్టాలి. రేపటికి కావలసిన పంచలచాపూ--వగైరాలన్నింటినీ సిద్ధపరచుకోవాలి.

ఆలోచనల్లో తేలిపోతూ గుమ్మంయెక్కేడు సుబ్బారావు. ప్లాస్కులోంచి గ్లాసులోకి కాఫీ పోసియిచ్చింది విజయలక్ష్మి. మేనమామ ముఖంలోకిచూస్తూ వుండిపోయింది. పెళ్ళివారు యేం జవాబిచ్చారోనని ఆతృతపడింది తెల్సుకోడానికి.

"విజయలక్ష్మి! నీ అదృష్టం బాగుంది. నా శ్రమా ఫలించింది. వాళ్లు వొప్పుకున్నారు."

సిగ్గుతో తలవంచుకుని గదిలోకి వెళ్ళిపోయింది.

"రేపే నిశ్చయతాంబూలాలు యివ్వడానికి పుచ్చుకోడానికీ, రామలింగంపంతులు నిర్ణయించారు" అన్నాడు కాఫీగ్లాసు క్రింద పెడుతూ.

"అంతా బాగానేవుంది. గాని......" అన్నది కామేశ్వరమ్మ.

"కాని...?"

"కుర్రాడి జాతకం చూపించావా?"

"రామలింగంగారు చూచారు. చాలా బాగుందన్నారు. యిద్దరికీ నచ్చుతుందనికూడా అన్నారు. యిదిగో అతని జాతకం నాదగ్గిరే వుంది. నీవెర్రిగాని, జాతకాలు నమ్మకూడదు. ఏది ఎలా జరగాలో అది అలా జరుగుతుంది. తప్పించడానికి నీకూ, నాకూ యెవ్వరికీ శక్యం కాదు. తీరా జాతకాల్లో యేదేనా విపరీతం కనబడితే అది మనోవ్యథగా మారి అందుకోబోతున్న బంగారాన్ని కూడా విడిచిపెట్టవలసి వస్తుంది. అంచేత వాటిల్లో నాకు నమ్మకం లేదు."

"అదికాదు తమ్ముడూ, ప్రకాశంగారు చూస్తామన్నారు."

"పోనీదెద్దూ—ఆ వూసు నాముందు యెత్తకు. ఇదేనా రామలింగంగారు యిచ్చారుగనుక తెచ్చాను."

"ఏదీ యిలా యివ్వు."

"ఇదిగో. వెధవది, జాతకాలు నమ్మేవాళ్లని నిలువునా చీరెయ్యాలి."

"అలా అనకు..."

"ఎవరికేనా చూపించినట్లయితే, పిల్ల జాతకంలో దోషంవుందనో, పిల్లాడి జాతకంలో దోషం వుందనో చెపుతారు. అప్పుడు నమ్మలేం, నమ్మకపోలేం."

"పోనీ చూపిద్దాం..."

"అయితే నీ యిష్టం, యింతకీ మనవాడు, రామలింగంపంతులు చూశాడుకదా. ఎంతో బాగున్నాయన్నాడు."

* * *

"తెల్లారితే నిశ్చయతాంబూలం పుచ్చుకుంటామని అందరికీ కబుర్లు పెట్టారు రామప్పంతులుగారు. చీకటిపడేసరికి చేరుకున్నారందరూ. రామలింగం గారింట్లోనే అందరూ బసచేశారు. మరునాడు పదిగంటలకు ముహూర్తం.

తెల్లారినతర్వాత ఏడు గంటలకల్లా సుబ్బారావు వచ్చి రామలింగంగారి ముందు నిలబడ్డాడు తలవంచుకుని. ఆయన స్నానంచేస్తూ, "ఏం అలా వున్నావ్?" అన్నారు.

"అనుకున్నదొకటీ జరిగేదొకటీను."

"అదేం అలా అంటున్నావ్?"

"కుర్రాడి జాతకం మంచిది కాదట!"

"ఎవరు చెప్పారు?"

"ప్రకాశంగారు."

"వాడిబొంద, వాడికేం తెలుసు జాతకం సంగతి."

"మా అక్కయ్యతోటీ, యింకా మా అమ్మతోటీ, నా భార్యతోటీ చెప్పాడు."

"అయితే వాళ్ళేమన్నారు?"

"ససేమిరా, వీల్లేదంటున్నారు."

"వాడికెందుకు చూపించావ్ జాతకం?"

"కామేశ్వరక్కయ్య అడిగి తీసుకుంది."

"అది కూడా కల్సిందీ, యిక దానికి నచ్చచెప్పడం బ్రహ్మాతరం కాదు."

"అంతా నాకర్మ—నాకు మాటపడే యోగం వుంది. అసలు జాతకం అంటే నాకు గిట్టదు. అలాంటిది, మీరు యిచ్చిన కాగితం నేనెందుకు జేబులో పెట్టుకున్నాను? వాళ్ళముందు యెలా నిలబడడం? వాళ్లతో ఏమని చెప్పటం? ఏవో గ్రహాలు తప్పుడుస్థానాల్లోవున్నాయని, కుర్రాడికి మరో పెళ్ళి అయ్యే యోగంవుందనీ, యిలాగా చెప్పుకొచ్చాట్ట నిన్నరాత్రి. నేను లేనా సమయంలో."

"బాగానేవుంది. నేనొచ్చి అడుగుతా పద."

స్నానం అయిపోగానే బట్టలు వేసుకుని, సుబ్బారావూ రామలింగంగారూ ప్రకాశంగారి ఎదుట కెళ్లారు.

"ఏం చూచి నువ్వు యిలా జాతకం బాగులేదన్నావయ్యా?"

"ఇవిగో యీ పుస్తకాలు చూడవయ్యా, యిందులో స్పష్టంగా వ్రాసివుంది."

"నువ్వెందు కొచ్చావయ్యా మధ్యకి! అయినా పిల్లకి ఆయుర్దాయం చెల్లితేకదటయ్యా నువ్వన్నట్లు

జరగటం? సంపూర్ణాయుర్దాయం వున్నదాయె పిల్ల జాతకంలో."

"నువ్వు లక్షచెప్పు, నీకు జాతకాల్లో ప్రవేశం లేదు."

"నాకా ప్రవేశంలేదు? నా జీవితమంతా జాతకాల్లోనే గడిపాను. నావద్దనున్న పుస్తకాల్లో యెక్కడా అలా లేదు."

"నీకు తెలిసి యేడిస్తేకదూ."

"మాటలు తిన్నగా రానీ—"

"నువ్వుచేసే దేమిటయ్యా?"

"చూపిస్తా నే చేసేదేమిటో" రామలింగం పంతులు ప్రకాశంగారిమీద కురికారు. సుబ్బారావు అడ్డుకున్నాడు; గాని, ప్రకాశంగారు బలంగా గాయపడేవారే. మూలనున్న మొండి కత్తిని ఆయుధంగా వుపయోగించారాయన.

* * *

నారాయణరావులో కించిత్తుకూడా అధైర్యం కలుగలేదు. ఎలాగైనా తను ఆ సంబంధం స్థిర పరచుకోనగలనని నిబ్బరపడ్డాడు. విజయలక్ష్మి తనని ప్రేమించింది. తను ఆమెని ప్రేమించాడు. ఎందరు అడ్డువచ్చినా తనతో ఆమెకి కళ్యాణం జరిగితీరుతుంది.

"నీ వెర్రిగాని యింకా ఆ సంబంధంకోసం యెదురుచూడ్డం అనవసరం—"

"లేదు నాన్నా నాలో యింకా "ఆశ" పీడిస్తూంది. ఇవాళ కాకపోతే రేపైనా వాళ్లు మళ్ళీ మన గుమ్మంలోకి వస్తారు."

"ఏమో నాకు నమ్మకంలేదు-అదీగాక మరో సంబంధం రాదు గనుకనా కాని, తీరనికళంకం ఆపాదించాడు ఆ ప్రకాశంగాడెవడో యీ విషయం తెలిస్తే ఎవరైనా జంకుతారు."

"అందుకే మనం యెలాగన్నా మన జాతకం మంచిదని ఋజువుచేసుకుని ఆ సంబంధమే స్థిర పరుచుకోవాలి. పిల్లకికూడా బాగా ఇష్టముంది."

"మళ్ళీ మనం వాళ్ళ కాళ్ళమీద పడడమా? అది ఒట్టిమాట. మన యింటికి వాళ్ళు రావాలి గాని, మనం ఒకరింటికి వెళ్ళం."

"పోనీ మనం వెళ్ళొద్దు. మనకి ఆపాదించబడ్డ కళంకాన్ని తుడిచివేసుకోనే భారం మనది. అవునంటూరా?"

"అదీ నిజమే. మనం నలుగురైదుగురు సిద్ధాంతులు దగ్గరికి పట్టుకెళ్ళి సందేహం నివృత్తి చేసుకోవాలి. బరంపురంలో మా స్నేహితుడు సత్యం పంతులుకికూడా యిప్పుడే రెండు జాతకాలూ పంపిస్తా. ఎందులో తప్పున్నదీ తెలుస్తుంది."

ఈ రాత్రి బండిలో నేను వెళుతున్నా. ఎలాగైనా పట్టుపట్టి మనం ఈకార్యాన్ని సాధించాలి."

"ఏదైనా ఆశ వదులుకోవడం ఉత్తమం."

* * *

"నలుగుర్లోనూ తిరగడానికి వీలులేకుండా అయింది. ఈ సంబంధం విషయంలో పూర్తిగా మాట పడిపోయాను నేను తీసుకొచ్చిన సంబంధం యిలా అకారణంగా నిలిచిపోవడంలో అర్థంలేదు. మూఢనమ్మకాలు కాకపోతే, అదే కారణంగా సంబంధాన్ని ఎందుకు వదులుకోవాలి" తల పట్టుకుని అన్నాడు కోటీశ్వర్రావు.

"తల్లిలేని పిల్లనిచూస్తూచూస్తూఅలాంటివాడికి యెల్లా ఇచ్చెయ్యడం? అక్కయ్య చచ్చిపోయిందగ్గరనుండీ నేనే నా కూతురిలా పెంచాను. బాహాటంగా రెండోపెళ్ళి అయ్యేయోగం కనబడుతూంటే..." అన్నది కామేశ్వరమ్మ.

"నీ బొంద ఏ వెధవో చెప్పాడని అలా అనడము బాగుండలేదు. అసలు ఆ విషయం నిజం కాదట. వాళ్లు యెంతమందసిద్ధాంతులకో చూపించారట. అందరు చెప్పిందీ, ఇతను చెప్పినది అబద్ధమనే. మణిపూసలాంటి కుర్రాడు" విసురుగా అన్నాడు సుబ్బారావు.

"ఎవడ్రా నేను చెప్పింది తప్పన్నవాడు?" మేడ మెట్లుదిగుతూ గద్దించాడు ప్రకాశం.

"ఎంతోమంది..." అన్నాడు సుబ్బారావు

"వాళ్ళ కేంతెల్సు పోరా."

"మీకు మహతెల్సు" యీసడించాడు సుబ్బారావు.

"అతన్నెందుకురా అలా అంటావు—ఆ కుర్రాడికీ మన లక్ష్మికీ కలిసేయోగం లేదన్నమాట—" కామేశ్వరమ్మ.

"చేతగాకపోతే వేదాంతం" అక్కడినుండి లేచిపోయాడు కోటీశ్వర్రావు.

సుబ్బారావు కూడా అనుసరించాడు.

"నామీద యెందుకంత కోపం?" ప్రశ్నించాడు కామేశ్వరమ్మని.

"బాగా అన్నారు. ఎలాగైనా ఆ సంబంధం చెయ్యనివ్వను. చూస్తూచూస్తూ నా లక్ష్మిని గోతులో తొయ్యను. గాలిలో దీపం పెట్టి "గాలిదేవుడా నీదే భారం'' అంటే ఏం ప్రయోజనం?"

"అలా అను" ఒక్కసారి చుట్టపొగ బాగా పీల్చి—

"మొన్న నాకో వుత్తరం వచ్చింది" పొగ వదిలి, తుపుక్కున ఉమ్మేడు మండువాలోకి.

"ఎక్కణ్ణుంచి?''

"బెంగళూరునుండి."

"అంటే...?"

"నాకు తెలిసిన ఓ రైల్వే ఆతనున్నాడు. అతని కొడుకు 'తాతా'లో పనిచేస్తున్నాట్ట. రెండువందలదాకా తెచ్చుకుంటున్నాట్ట."

ప్రకాశంగారి మొహంలోకి దీర్ఘంగా చూస్తూంది కామేశ్వరమ్మ.

"ఒక్క చెల్లెలుమాత్రం వున్నదట. అది కూడా స్కూలుఫైనలుదాకా వెళ్ళిందట. ఇద్దరికీ యెక్కడేనా సంబంధం చూడమని రాశాడు."

"ఏమిటీ! మొన్న నొచ్చిందా! అయితే ఆ సంబంధంగురించి మనం తాపత్రయపడితే? మావాడు కూడా అక్కడే పనిచేస్తున్నాడు కనక వాళ్ళపిల్లని మనవాడికి, మనపిల్లని వాళ్ళ అబ్బాయికీ — నిర్ణయంచేస్తే బాగుంటుందేమో, ఆలోచించండి బాబయ్యా."

"అందుకేగదూ నీతో చెపుతున్నది కుర్రాడికి రెండువేల నూటపదహార్లు కట్నం కావాలిట. ఇస్తేమాత్రం పప్పేముంది. రెండువందల రూపాయిం జీతగాడు. వెధవది స్థిరాస్థి లేనంతమాత్రాన వాళ్ళకేం తక్కువా? వున్నవాళ్లు మహాయేం అనుభవించుతున్నారు కనక. ఈనాం భూములయితే రైతులపరమే అయిపోతున్నాయి యిప్పుడు."

"పదిహేనువందలదాకా యీ సంబంధానికివ్వడానికి నిశ్చయించుకున్నాం కదా. మరో అయిదువందలు యెలాగన్నా తేగలం."

"భేష్-నామాట నువ్వు అర్థం చేసుకున్నావు. ఆలా చేస్తే మంచిదే."

"మరి మా వాడికికూడా ఇప్పుడు నూటఏనభైదాకా యిస్తున్నారు. అంతకంటె మావాడు తక్కువవాడు కాడు. వీడికికూడా అలా ఇప్పించే యేర్పాటు చేయించండి."

"అలాగేనమ్మా ఇవేళే వుత్తరాసి తెప్పిస్తాను."

*   *   *

తనకిక నారాయణరావుతో పెళ్ళికాదు. కానివ్వదు పినతల్లి. సుబ్బారావు మామయ్యా, కోటీశ్వర్రావూ పిన్నికి యెదురాడలేరు. తను ఆ 'ఆశని' 'నిరాశ' చేసుకోవలసిందేనా?

"కాదు-నువ్వూరుకోకు నారాయణరావు నీకోసం పరితపిస్తున్నాడు" అంతరాత్మ ఉద్బోధించింది.

"మరి ఆయనతో ఎలా పెళ్ళి జరుగుతుంది?" ప్రశ్నించింది విజయలక్ష్మి.

"అది నీలోనే వుంది."

"అంటే?"

"పిచ్చిదానా ఎదురు తిరుగు.".

"ఎలా సాధ్యమవుతుంది?"

"పిరికితనం వదులు. ధైర్యం తెచ్చుకో. మీ పిన్ని చెవిలో యిల్లుకట్టుకుని పోరుపెట్టు."

"సరే. తప్పకుండా అలాగే చేస్తాను. నారాయణరావుగార్ని విడిచివుండలేను."

అంతర్థానమయింది అంతరాత్మ.

వండుతూన్న పినతల్లిదగ్గర కూచుంది వెళ్ళి, విజయలక్ష్మి.

"ఏం అలానీరసంగా వున్నావు? ముఖం వాడిందేమమ్మా" బుజ్జగిస్తూ అడిగింది పినతల్లి.

"ఏంలేదు"

"నాదగ్గర దాచుతున్నావు"

"లేదుపిన్నీ యికనేను యిలా వుండవలసిందే"

కామేశ్వరమ్మకి అర్థంగాలేదు.

"అదేం నా కర్థంకాలేదు."

"ఎలా అవుతుంది అర్థం?"

"చెప్పవే వేధించక"

బుర్రదించుకుని వెక్కివెక్కి యేడవడం మొదలెట్టింది.

"అదేమిటే అలా యేడుస్తావు? నాతో చెప్పడానికేమే?"

"నాకు మరో సంబంధం వద్దు"

"అంటే యెవరు కావాలంటావే?"

"మొన్నటి..."

"జాతకం మంచిదికాదే నువ్వు చచ్చిపోతే నేను వుండగలనా?" యింకా యేడుస్తూంది విజయలక్ష్మి.

"సరేలే ఆలోచిద్దాం. మరో సంబంధంమాత్రం ఆయిపోయింది కనుక నా ఊరుకో" అప్పటికి సముదాయించింది.

* * *

చదువు మానేసి ఆసంవత్సరమే ఉద్యోగంలో ప్రవేశించాడు నారాయణరావు. మరిచదవడానికి అతనికీ మనస్సొప్పలేదు, రామప్పంతులు కూడా అంగీకరించలేదు. యిక్కడేవుంటే తనకి చేదోడు వాదోడుగా వుంటాడని ఆయన నమ్మకం. అందుకే ఉన్న వూళ్లోనే నౌఖరీ దొరికింది. యాభయి రూపాయిలజీతం. ఆజీతంమీద, భూములమీంచి వచ్చేరాబడిమీద సుఖంగా కాలం వెళ్లబుచ్చవచ్చునని ఆయన సంకల్పం. అందుకు నారాయణరావు కూడా యెదురాడలేదు. మరోవూరి ఉద్యోగం అంటే అతనికి యిష్టంలేదు.

"పిల్ల జాతకం మంచిదికాదట్రా ఆసంబంధం వదులుకోవడం సముచితం"

"నాన్నా మరోసంబంధం అంటే నా కిష్టంలేదు"

"పిల్లజాతకం మంచిదికాదంటూంటే"

"ఏమిటా మంచిదికాకపోయింది?"

"ఆపిల్లకి వైధవరిక ముందట. అదీగాక, అది యెక్కడుంటే అక్కడ నాశనం కూడాను"

"వాళ్లలా మీకూ వెర్రిపట్టుకుందీ మనజాతకం బాగులేదని వాళ్ళూ, వాళ్ళజాతకం బాగులేదని మనమూ బాగానేవుంది!"

అదికాదురా మనగురించి వాడు తప్పుగా చెప్పాడురా. వాడు యిలా యెంతమందినో దగా చెయ్యడం నాకు తెల్సు. వాడు ఒక "లిటికెంటు" యెన్నో వ్యవహారాలని యిలాగే పాడుచేశాడు. పెదపాలెం రైతులని అనవసరంగా కోర్టులవెంటతిప్పి వాళ్ళదగ్గిర రెండుమూడు వేలరూపాయిలు కాజేసి, చివరికి బికారులుగా చేశాడు వాళ్లని. ఆవిషయం నాకు బాగా తెల్సు."

నిజమే మీకు తెల్సివుండవచ్చును. యితడు దగాకోరని వాళ్ళకు తెలియవద్దూ"

"వెంకటేశ్వర్రావుకి తెల్సును. అందుకేవాడు యెంతో యిదవుతున్నాడు. అయినా ఆవిడ ముందు వీళ్ళందరూ ఒకటే. ఆడపెత్తనం వున్న యింట్లో మొగాళ్లు మెలగలేరురా."

"సరే అవన్నీ మనకెందుకు? మనం యెల్లాగన్నా పట్టుపట్టి ఆపిల్లని నాదానిగా చేసుకోవాలి నాన్నా. అసలు ఆ ప్రకాశంగాడు నాకు పెళ్ళిఅయ్యే యోగమేలేదేమో అన్నాట్ట"

"అవునుగాని వాళ్ళ తెలివితక్కువ కాకపోతే, మొదట "రెండోపెళ్ళి వుంద" న్నాడూ, ఆతర్వాత "పెళ్ళేజరగద"న్నాడూ అప్పుడైనా వాళ్ళు, అందులోని ఆంతర్యం గ్రహించవద్దూ"

"అంతపాటి బుర్రలా. యింతకీ మీరన్నట్లు ఆడపెత్తనం!"

"నాకు అనుమానంకలుగుతూంది. వాడిమొరికిని ఎక్కన్నా మరోసంబంధమున్నదేమో——"

"అవును నాన్నా- బాగాచెప్పారు——"

"ఒకపనిచేస్తే- దెబ్బకిదెబ్బ!—"

ప్రశ్నార్థకంగా చూచాడు తండ్రి ముఖంలోకి నారాయణరావు.

"మనం నింపాదిగా అవతలవాళ్లెవరో కనుక్కొని, పిల్లజాతకం మంచిదికాదని—వాళ్లకి నచ్చచెప్పినట్లయితే, వాళ్లబాగరు అణుగుతుంది-"

"తప్పునాన్నా- అలా మనంచెయ్యకూడదు. మనకి యివ్వకపోయినంతమాత్రాన ఆపిల్లగూర్చి మనం తప్పుడుగా ప్రచారం చెయ్యరాదు-"

"తప్పేమిట్రా- మనగురించి అన్యాయంగా వాడు తప్పుడుప్రచారం చెయ్యవచ్చునూ?——"

"వాళ్ళు తప్పుచేశారని—మనంకూడా తప్పుచేస్తామా? ఒకరు నూతిలో దూకితే మనంకూడా దూకుతామా?——

(ముగింపు వచ్చేసంచికలో)

నిరక్షరాస్యులైన చైనా స్త్రీలు అంటారు——"ఇంకెవరో మనని కన్నారు. మనం యింకెవరినో కంటాము" అని. దీనిలో ఎంతో అర్థంవుంది. మనం సిగ్గుపడేటటువంటి సంతానం కనకుండా వుండడమే జీవితంలో మనం కోరేది.

——లిన్. యుటాంగ్.